కార్మిక హక్కులను కాలరాసిన బీజేపీ

మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కురపాటి రమేశ్

ఎదులాపురం, మార్చి 29 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ పదేళ్ల పాలనలో కార్మిక హక్కులను కాలరాసిందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ కార్పొరేటర్ సంస్థలకు లాభాలు వచ్చేలా కార్మిక చట్టాలు చేసిందన్నారు. ఆదాని, అంబానీల ఆస్తులు పెంచి, ఆకలి సూచిలో దేశం 111వ స్థానంలో నిలిచిందన్నారు. 104కోట్ల మంది పేదలు దారిద్రంలో ఉన్నారని ఐక్యరాజ్య సమితి పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన బీజేపీపై కనీసం కేసు నమోదు కాదు, కానీ ప్రతిపక్షాలను ఈడీతో అరెస్టులు చేయిస్తున్నదని విమర్శించారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమన్న, జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, కోశాధికారి సునీత, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేశ్, గంగన్న, వెంకటమ్మ, లింగాల చిన్నన్న, కార్యదర్శులు సుజాత, అగ్గిమల్ల స్వామి, కమిటీ సభ్యులు గంగయ్య, మామిడి స్వామి పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతోనే అధిక దిగుబడులు

కంపోస్ట్ ఎరువుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దేశ్‌పాండే ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

తాంసి, మార్చి 29 : సేంద్రియ వ్యవసాయంతోనే భూసారాన్ని కాపాడి అధిక దిగుబడులు సాధించవచ్చని దేశ్‌పాండే ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రాజేందర్ అన్నారు. శుక్రవారం కప్పర్ల గ్రామానికి చెందిన రైతు గండ్రత్ భగవాండ్లు ఏర్పాటు చేసిన వర్మి కంపోస్ట్ యూనిట్‌ను రైతులతో కలిసి క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. అనంతరం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతులు పాటిస్తూ పంటలు సాగు చేయాలని సూచించారు. రైతులు బొజ్జ అశోక్, గండ్రత్ అశోక్, కౌడల రాహుల్ కంపోస్టు ఎరువులతో వేసిన పంటలను వారి అనుభవాన్ని తోటిరైతులతో పంచుకున్నారు. అనంతరం రైతు గండ్రత్ భగవాండ్లను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహేందర్, రైతులు వామన్, ప్రమోద్, రమేశ్, ఆశన్న పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

దరఖాస్తులు స్వీకరిస్తున్న టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాహుల్

ఎదులాపురం, మార్చి 29 : జిల్లా కేంద్రంలోని తెలంగాణ స్టూడెంట్ ఫోరం సొసైటీ ఆధ్వర్యంలో ఓసియన్ కంప్యూటర్ సౌజన్యంతో వేసవి సెలవులలో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు టీఎస్ఎఫ్ అధ్యక్షుడు రాహుల్ తెలిపారు. శుక్రవారం ఓసియన్ కంప్యూటర్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. కార్యక్రమంలో ఓసియన్ కంప్యూటర్ యాజమాన్యం, సిబ్బంది మహేశ్‌సింగ్, సాయికుమార్, వేణు, అంకిత, సత్యనారాయణ, టీఎస్ఎఫ్ నాయకులు ఇష్తీకార్, సత్యనారాయణ, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఊరట..!

- పెరగనున్న దినసరి వేతనం
- ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు
- 19,139 మందికి లబ్ధి

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నార్నూర్, మార్చి 29 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల దినసరి వేతనం ఏప్రిల్ 1వ తేదీ నుంచి పెరగనుంది. ప్రస్తుతం కొలతల వారీగా రోజూ రూ.272 చెల్లిస్తుండగా వచ్చే నెల 1వ తేదీ నుంచి రూ.28 పెంచనున్నారు. వేసవి భత్యం లేక ఇబ్బందులు పడుతున్న కూలీలకు పెరగనున్న రోజువారి కూలితో ఉపశమనం కలగనుంది. నార్నూర్, గాదిగూడ మండలాల్లో 18,814 కుటుంబాలు జాబ్‌కార్డులు కలిగి ఉన్నాయి. వాటిలో 19,139 మంది కూలీలు నమోదై ఉన్నారు. 10,666 జాబ్ కార్డులకు సంబంధించిన కూలీలు హాజరవుతున్నారు. ఎండలు ముదరడంతో పాటు పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు, మెడికల్‌కిట్లు లేకపోవడంతో, వేసవి అలవెన్స్ ఎత్తివేయడం వంటి కారణాలతో పనులకు వెళ్లడానికి కూలీలు ఆసక్తి చూపడం లేదు. గతంలో ఉపాధి కూలీలకు వేసవి ఆలవెన్స్ చెల్లించేది. ఫిబ్రవరి, జూన్ నెలల్లో 20 శాతం, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం అదనపు వేతనం చెల్లించేది. రెండేళ్లుగా కూలీలకు వేసవి భత్యం ఇవ్వడం లేదు. కానీ ప్రతి ఏటా దినసరి వేతనం పెంచుతుంది. 2022-23ఆర్థిక సంవత్సరంలో రూ.258, 2023-24 సంవత్సరంలోరూ.272 చెల్లించింది. 2024-25ఆర్థిక సంవత్సరానికి గాను ఏప్రిల్ 1వ తేదీ నుంచి రూ.300 చెల్లించనుంది. పెరగనున్న వేతనాన్ని ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారికంగా ప్రకటించడం లేదు. సాఫ్ట్‌వేర్ మారిన తర్వాత వేతనాల చెల్లింపులో ఆలస్యం జరుగనుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పథకం ప్రారంభంలో వారం రోజులకు ఒకసారి క్రమం తప్పకుండా వేతనం చెల్లించేవారు. ప్రస్తుతం నెలల కొద్ది జాప్యం జరుగుతుంది.

పెంచిన వేతనం తక్కువే..

నిత్యావసర ధరలు పెరుగుతున్నాయి. వాటితో పోలిస్తే ఉపాధి కూలీలకు పెంచిన వేతనం తక్కువే. కనీస వేతనం రోజుకు రూ.500 చెల్లించాలి. వేసవి అలవెన్స్ కూడా చెల్లించాలి. జాప్యం చేయకుండా సకాలంలో డబ్బులు చెల్లించాలి.

-మెస్రం మోతీరాం, ఉపాధి కూలీ

మీ సేవ కేంద్రంలో స్లాట్‌బుక్ చేసుకోవాలి

ఎదులాపురం, మార్చి 29: దివ్యాంగుల ధృవీకరణ పత్రం పొందుటకు మీ సేవ కేంద్రాల్లో స్లాట్‌బుక్ చేసుకోవాలని డీఆర్‌డీఏ సాయన్న ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకొని నిర్ణీత తేదీల్లో స్థానిక రిమ్స్‌లో డాక్టర్లుతో పరీక్షించుటకు సంప్రదించాలని సూచించారు. గతంలో పొందిన సర్టిఫికెట్ల కాలపరిమితి పూర్తయిన వారు రెన్యూవల్ కోసం కొత్తగా సర్టిఫికెట్‌ను పొందాలన్నారు. ఏప్రిల్ ,మే, జూన్ నెలలో మీ సేవ కేంద్రల్లో స్లాట్‌బుక్ చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు

ఎదులాపురం, మార్చి 29 : అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ స్టేషన్ ఎక్సైజ్ సీఐ విజేందర్ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలు అనంతరం 32 కేసులు నమోదు చేసి 22 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, మద్యం షాపుల నుంచి రూ.3.10లక్షల విలువైన 180 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బైండోవర్ ఉల్లంఘనకు పాల్పడిన మహ్మద్ హఫీజ్, సుదాంలకు నోటీసులు జారీ చేశామన్నారు. మహారాష్ట్ర నుంచి మద్యం తరలిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

భైంసా, మార్చి 29 : భైంసా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీ శంకర్ ఎన్నికవగా శుక్రవారం పలువురు సత్కరించారు. కార్యక్రమంలో రాజేశ్వర్, మోహన్, పోశెట్టి ఉన్నారు.

యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఉచిత కోచింగ్

ఎదులాపురం, మార్చి 29 : తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్ సర్వీస్-2025 పరీక్ష కోసం 100 మంది మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహించనున్నట్లు మైనార్టీ జిల్లా సంక్షేమ అధికారి రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బౌద్ధులు, పార్సి అభ్యర్థులు ఆన్ లైన్ http://www. tmreistelangana. cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. శిక్షణకు రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు అన్ని రిజర్వుడ్ కేటగిరిల్లో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. శిక్షణ హైదరాబాద్ మైనార్టీ స్టడీ సర్కిల్‌లో ఉంటుందన్నారు. మొదటి సారి ప్రవేశం పొందే అభ్యర్థులందరూ ఏప్రిల్ 12వ తేదీ వరకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రకారం ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 28 వ తేదీ జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉంటుందన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్

ఉట్నూర్, మార్చి 29: మండల కేంద్రంలోని జామ మసీద్‌లో సామాజిక కార్యకర్త కేశవ్ శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉంటాయన్నారు. వారికి ఇలా ఇఫ్తార్ విందు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.


పండ్లు తింటున్న ముస్లింలు

ఉట్నూర్‌రూరల్: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఎదులాపురం : శిలువ యాత్రను పాల్గొన్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ఇంద్రవెల్లి: ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

ఎదులాపురం, మార్చి 29 : జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదిలాబాద్‌లోని సీఎస్ఐ చర్చిలో క్రైస్తవులు శిలువ యాత్ర నిర్వహించారు. ఏసుక్రీస్తు వేషధారణలో శిలాన్ని మోస్తూ గుడ్ ఫ్రైడే ఘటాన్ని వివరించారు. ఈ సందర్భంగా రెవరెండ్ సామ్యూల్, పాస్టర్ చైతన్య గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించారు.

ఇంద్రవెల్లి, మార్చి 29 : మండల కేంద్రంలోని హోలి ట్రినిటీ చర్చిలో క్రైస్తవులు శిలువతో భారీ ఊరేగింపు నిర్వహించారు. శిలువ ఏర్పాటు చేసిన స్థలంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బోథ్, మార్చి 29: బోథ్, పొచ్చర, కౌట(బీ) గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ సందేశాన్ని వినిపించారు. గుడ్‌ఫ్రైడే ప్రాధాన్యాన్ని వివరించారు.

తాంసి, మార్చి 29 : మండలంలోని పలు చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిల కమిటీ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుభ శుక్రవారం ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజు కావడంతో క్రైస్తవ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేయగా శిలువపై యేసు పలికిన ఏడు మాటల ధ్యానించి ఏసుప్రభు త్యాగాలను స్మరించుకున్నారు.

ఉట్నూర్ రూరల్, మార్చి 29: ఉట్నూర్‌లోని సీఎస్ఐ చర్చిలో రెవరెంట్ కుమార్ అయ్యగారు, లక్కారం బేతస్థ చర్చిలో పాస్టర్ డేనియల్, గంగన్నపేట్‌లోని మోరియా చర్చిలో పాస్టర్ రాజరత్నం, శ్యాంపూర్ సీఎస్ఐ చర్చిలో శ్యాముల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా దంతన్‌పల్లి, బిర్సాయిపేట్, పులిమడుగు గ్రామాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దివ్యాంగుడికి వీల్ చైర్ వితరణ

వీల్‌చైర్ అందజేస్తున్న సొసైటీ సభ్యులు

బోథ్, మార్చి 29 : గుర్రాలతండా గ్రామానికి చెందిన రఘువీర్ సింగ్ అనే యువకుడికి శుక్రవారం తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వీల్ చైర్ అందజేశారు. గతంలో సొసైటీ అధ్యక్షుడు బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ గ్రామాల పర్యటనలో భాగంగా రఘువీర్ ఇంటికి వెళ్లారు. ఇచ్చిన హామీ మేరకు వీల్‌చైర్ సమకూర్చి అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సర్ధరాజ్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 29 : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సర్ధరాజ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలం చిచ్‌ధరి ఖానాపూర్‌లో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సత్యవతి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఇచ్చోడ, మార్చి 29: రైతులు ఆర్థికంగా నష్టపోకుండా తమ పశువులకు టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. శుక్రవారం జల్దా గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శేఖర్, దేవ్‌రావ్, రైతులు పాల్గొన్నారు.

టీకా వేస్తున్న పశు వైద్యాధికారి గోవింద్ నాయక్

బాధితరాలిని పరామర్శించిన ఎంపీపీ

బాధితురాలిని పరామర్శిస్తున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

ఉట్నూర్ రూరల్, మార్చి 29 : పెద్దసుద్దగూడ గ్రామానికి చెందిన గిరిజబాయి శుక్రవారం అడవికి మొర్రి పండ్లు కోయడానికి వెళ్లింది. చెట్టు ఎక్కి మొర్రి పండ్లు కోసే క్రమంలో చెట్టుపై నుంచి జారి పడి కిందపడడంతో గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ దవాఖానకు వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

సమస్యల 'సంత' సుంకిడి

- రోడ్లపైన క్రయవిక్రయాలు
- షెడ్లు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం లేక ఇక్కట్లు
- పార్కింగ్ వసతి లేక ట్రాఫిక్ కష్టాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

సుంకిడి సంతలో రోడ్లపై కూరగాయలు, పండ్లు విక్రయిస్తున్న వ్యాపారులు

తాంసి, మార్చి 29: తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో ఆదివారం నిర్వహించే వారంతపు సంతకు కనీస వసతులు కరువయ్యాయి. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ వ్యాపారులు కూరగాయలు విక్రయిస్తున్నారు. సంతను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. స్వయం ఉపాధి పథకాల ద్వారా సంతను అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు వారంతపు సంత అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. వ్యాపారులకు శాశ్వత షెడ్లు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పార్కింగ్ సౌకర్యం లేక ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. సంతకు స్థలాన్ని కేటాయించి షెడ్లను ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లను నిర్మించి తాగునీటి సదుపాయం కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా సంతలో నడుస్తున్న వాహనాలు

ప్రభుత్వం ఆదుకోవాలి

ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ రోడ్లపైన కూరగాయలు విక్రయిస్తున్నాం. ప్రభుత్వం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించి షెడ్లు నిర్మించి వ్యాపారస్తులను ఆదుకోవాలి.

- మెట్టు శ్రీకాంత్, గ్రామస్తుడు, సుంకిడి

షెడ్లు నిర్మించాలి

వ్యాపారస్తులకు షెడ్లు నిర్మించాలి. షెడ్లు లేకపోవడంతో రోడ్లపైన కూరగాయలు విక్రయిస్తున్నాం. ఇరుకు రోడ్లపై ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. చిరు వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- మేకల నర్సయ్య, కూరగాయల వ్యాపారి, సుంకిడి

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

ఖానాపూర్ టౌన్, మార్చి 29 : నేరాల నియంత్రణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో శుక్రవారం ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు లేని 3 కార్లు, 41 బైకులు, 6 ఆటోలు, టాటా ఏస్ వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రయాణించే సమయంలో వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు లింబాద్రి, శంకర్, కృష్ణసాగర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్ టౌన్ : పట్టుకున్న వాహనాలతో పోలీసులు

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఖానాపూర్, మార్చి 29 : అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ఖానాపూర్ మున్సిపాలిటీలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యే చర్యలు చేపడుతున్నట్లు చైర్మన్ రాజురా సత్యం తెలిపారు. పట్టణ శివారులో శుక్రవారం డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద కొనసాగుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్ శ్రీనివాస్, కమిషనర్ మనోహర్, ఏఈ తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ

భైంసా, మార్చి 29 : పార్లమెంట్ ఎన్నికల ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. కమిటీలో రమాదేవి, లోలం శ్యాంసుందర్, విలాస్ గాదేవార్, డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ సభ్యులుగా ఉన్నారు.